క్లుప్తంగా

ఉప్పుగుండూరులో డీపీఓ విచారణ

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు పంచాయతీ పనితీరు, పారిశుధ్యం, నీటి నిర్వహణపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం డీపీఓ వెంకటేశ్వర్లు ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పంచాయతీలో ఏ ఒక్క రికార్డు సక్రమంగా లేదని, పారిశుధ్యం పనులు సక్రమంగా లేవని, తాగు నీటి నిర్వహణ సక్రమంగా లేదని నిర్ధారణకు వచ్చారు. పంచాయతీ పార్క్, చెరువులోని నీటిని, ఆర్ఓ ప్లాంట్, ఫిల్టర్ బెడ్డులు, కుళాయిల ద్వారా గ్రామానికి నీరు సరఫరా చేసే బావులను పరిశీలించారు. పంచాయతీ పాలక వర్గం పనితీరు, సమావేశాల హాజరు, తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని ఈఓ శ్రీనివాసరావును ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీ సిబ్బంది వివరాలు, జీతాల చెల్లింపుల వివరాలు, పంచాయతీలో నగదు నిల్వ, వసూలు చేసిన బిల్లులు ఎక్కడ ఉంటున్నాయి, తదితర వివరాలు అడగగా.. ఏ ఒక్క దానికీ సరైన సమాధానం పంచాయతీ అధికారి నుంచి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకవర్గం మూడు సమావేశాలకు రాకపోతే నివేదిక ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆ విధంగా ఉంటే పాలన ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాటిపై వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేళ్ల రవికుమార్, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీఎస్టీపై బైక్ ర్యాలీ

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంతపేటలోని విద్యుత్ భవన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కాపు కళ్యాణ మండపం వరకు ర్యాలీ సాగింది. ర్యాలీని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, ప్రకాశం జిల్లా జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించడం వలన ప్రజలకు ఎంతో డబ్బు ఆదా అవుతుందని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రదర్శనను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డీఈ కాశీవిశ్వేశ్వరరావు, ఒంగోలు నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ వి.మాధవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాపారావు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, జీఎస్టీ అధికారులు, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

పేదలపై కూటమి కుట్రలు

- ఉచిత వైద్యం అందకుండా చేసేందుకు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్న ప్రభుత్వం
- బినామీలైన కార్పొరేట్లకు దోచిపెట్టడానికే ఇదంతా..
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: రాష్ట్రంలోని పేదలకు ఉచిత వైద్యం అందకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి మద్దిపాడు మండలంలోని నాగన్నపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మేరుగు నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించకుండా, పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించకుండా చేసేందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. కేవలం ఐదు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తే రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలు పూర్తవుతాయని, కానీ, అలా చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు వాటిని అప్పగించి వారి ద్వారా లబ్ధిపొందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ హైదరాబాదు నుంచి విజయవాడకు ఫ్లైట్లలో తిరగడానికి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు అయ్యే ఖర్చు కంటే ఇదేమీ పెద్ద మొత్తం కాదని అన్నారు. వైద్య కళాశాలలను ప్రభుత్వమే కట్టించి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల పట్ల ఎప్పుడూ చంద్రబాబుకు చిన్న చూపే ఉంటుందని విమర్శించారు.



నాగన్నపాలెంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు



సంతనూతలపాడులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

వైఎస్ జగన్ హయాంలో విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక కేటాయింపులు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక కేటాయింపులు చేసి పేద ప్రజలకు అవసరమైన విధంగా అందుబాటులోకి తీసుకొచ్చారని మేరుగు నాగార్జున గుర్తుచేశారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేసి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందేలా చేశారన్నారు. ప్రతి సచివాలయంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. ఎక్కడా ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు పాలకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా గ్రామంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి మేరుగు నాగార్జున ఆవిష్కరించారు. అనంతరం సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాగులప్పలపాడు మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, నాయకులు పాలడుగు రాజీవ్, రవి, సీనియర్ నాయకులు బెజవాడ రాము, గుడ్డపాతల రవి, పల్లపాటి అన్వేష్, పైనం ప్రభాకర్, కంకణాల సురేష్, కాకర్ల వెంకటేష్, అనిల్, కాకర్లపూడి రజనీ, జయమ్మ, ఏసేబు, వేముల సుబ్బారావు, పైనం ప్రసాద్, పోకూరి శ్రీరామమూర్తి, రాతికింది జాన్, పైనం శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ...

సంతనూతలపాడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంతనూతలపాడులో శనివారం రాత్రి రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించగా, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మీరంతా పెట్టే సంతకం మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని అన్నారు. అందువలన కోటి సంతకాల కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేశారన్నారు. పలు కళాశాలలు నడుస్తున్నాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేసేందుకు పూనుకుందన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్ సీపీ చేస్తున్న ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలలను రక్షించుకుంటేనే భవిష్యత్తులో పేదవాడి పిల్లలు కూడా డాక్టర్లు అవుతారన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని భ్రష్టుపట్టించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు పెండింగ్‌లో పెట్టిన కారణంగా ప్రజలు ఉచిత వైద్యం కోసం ఆర్రులు చాచాల్సిన దుస్థితి ఏపీలో నెలకొందని విమర్శించారు. ఈ నేపథ్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని విజయవంతం చేసి కూటమి ప్రభుత్వం కళ్లుతెరిపించాలని మేరుగు నాగార్జున కోరారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ దుంపా యలమందారెడ్డి, తన్నీరు మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ నాయకుడు రావూరి శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు వెంకట సుబ్బయ్య, బీసీ సెల్ నాయకుడు ఏడుకొండలు, డాక్టర్ శ్రీనివాసరావు, శేషిరెడ్డి, తేళ్ల అనిల్, గాండ్ల పెదబాబు, వల్లెపు శీను, కే నాగాంజనేయులు, ఎన్.రామాంజనేయులు, షరీఫ్, శ్రీనివాసరావు, గౌసాని, అల్లాబక్షు, మస్తాన్‌వలి, సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణలో పాల్గొనాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపు

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకంగా జగనన్న పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ మహోద్యమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి సంతకాల మహోద్యమాన్ని ఎలా విజయవంతం చేయాలి, ఎవరి బాధ్యతలు ఏమిటనే దానిపై చర్చించారు. డివిజన్ల కమిటీలు, గ్రామ కమిటీలు పూర్తి చేస్తామన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను పెద్ద ఎత్తున జనంలోకి తీసుకెళ్లడం, దానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి గవర్నర్‌కు నివేదిక అందించే దానిలో చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు ట్రంకు రోడ్డు విస్తరణ పనుల్లో ఆర్యవైశ్యులకు నష్టపరిహారం ఇప్పించడంలో మద్దతుగా నిలబడినట్లు తెలిపారు. కార్యకర్తలకు వెన్నంటి ఉండి కాపాడుకోవడం, ఎటువంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతోందన్నారు. ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ నడుస్తోందన్నారు. ప్రభుత్వం నిరంకుశంగా పోతుంటే దానికి అడ్డుకట్ట వేయడానికి మన వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, రైతు విభాగం జోనల్ అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు రొండా అంజిరెడ్డి, శ్యామ్‌సాగర్, వై.వి. అశోక్, దామరాజు క్రాంతికుమార్, నరాల రమణారెడ్డి, కొణికి రోశయ్య, డివిజన్ అధ్యక్షులు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పాల్గొన్న నాయకులు

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

ఒంగోలు: న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని ప్రకాశం జిల్లా అడ్వొకేట్స్ ఫెడరేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక బార్ అసోసియేషన్ హాలులో ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు అధ్యక్షతన శనివారం ఈ సమావేశం నిర్వహించారు. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదులకు గతంలో ఇచ్చిన లైబ్రరీ ఏర్పాటు పథకం కొనసాగించాలని కోరారు. న్యాయవాది సంతాప సభ సమయాన్ని యథావిధిగా కొనసాగించాలని , బార్ కౌన్సిల్ ద్వారా బీమా ఏర్పాటు, బార్ కౌన్సిల్ ఇచ్చే డెత్ బెనిఫిట్స్‌తోపాటు ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటు గతంలో ఇచ్చిన మాదిరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా బార్ కౌన్సిల్ ఇచ్చే రూ.9 లక్షలను రూ.13 లక్షలకు పెంచాలని పేర్కొంటూ పలు అంశాలను తీర్మానించారు. సమావేశంలో గిద్దలూరు, దర్శి, అద్దంకి, సింగరాయకొండ, చీరాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు శేషయనారెడ్డి, ప్రేమ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, కార్యదర్శులు జగ్జీవన్, మేరుగు రవి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన జిల్లాలోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు

అన్ని సమస్యలకు పరిష్కారం.. ప్రశ్నించేతత్వం

ఒంగోలు సిటీ: ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు ఎ.వి.పుల్లారావు అన్నారు. శనివారం ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ హైస్కూల్లో చెకుముకి సైన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. స్థానిక పీవీఆర్ బాలికల హైస్కూల్లోనూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర అధ్యక్షుడు ఎస్వీ రంగారెడ్డి పాల్గొని మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

ఒంగోలు సిటీ: నగరంలో స్పా సెంటర్ల పేరుతో చట్టవ్యతిరేక, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న కేంద్రాలపై మహిళా పోలీస్ స్టేషన్ అధికారి యు.సుధాకర్ ఆధ్వర్యంలో ఒంగోలు టాస్క్ ఫోర్స్ సిబ్బంది శనివారం దాడులు చేశారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని స్పా సెంటర్లలో తనిఖీలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు వచ్చిన పసుపులేటి భాను ప్రకాష్‌తో పాటు నిర్వాహకులు కోడికల్ల శ్రీ అర్చన, హైదరాబాద్ అనే వారిపై ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. తనిఖీలలో టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు శివరామయ్య, చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది త్రిపురాంతకం లిమిట్స్‌లో పేకాటాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.39,740 రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో ఎస్సై సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లకు మరమ్మతులు చేయాలి

సంతనూతలపాడు: హాస్టళ్లలో పాడైపోయిన కిటికీలకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మద్దులూరు బీసీ హాస్టల్లో పాడైపోయిన కిటికీలకు మరమ్మతులు నిర్వహించి రెక్కలు బిగించాలని, దోమలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ హాస్టల్ భవనాన్ని శనివారం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. మద్దులూరు గ్రామం చివరలో ఉన్న హాస్టల్ భవనం మాగాణి ప్రాంతం పక్కనే ఉండటంతో దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు తెలిపారు. కిటికీలు పాడైపోయాయని, రెక్కలు కూడా లేవని చెప్పారు. దోమలు విపరీతంగా ఉన్నాయని వాపోయారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని సీపీఎం నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు డిమాండ్ చేశారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం వెంటనే మెనూ చార్జీలు పెంచాలని సీపీఎం, రైతు కార్మిక సంఘాల నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు డిమాండ్ చేశారు. శనివారం చీమకుర్తిలోని ఎస్సీ, బీసీ, గిరిజన హాస్టళ్లను వారు సందర్శించారు. గిరిజన పాఠశాల వద్ద పశువ్యర్థాలు, ఎస్సీ హాస్టల్లో సీలింగ్ పెచ్చులు ఊడిపడుతున్నాయని, బీసీ హాస్టల్‌లో స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేసి విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా గంధ మహోత్సవం

ఒంగోలు మెట్రో: హజరత్ సయ్యద్ కరిముల్లా ఖాదర్ కస్సూర్ మస్తాన్వలీ గంధ మహోత్సవాన్ని శనివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. స్థానిక గంటా పాలెంలో, ప్రకాష్ కాలనీలోని సయ్యద్ కరిముల్లా ఆధ్వర్యంలో సన్నాయి మేళాలతో ఫకీర్ జల్సాల్‌లు, జెండా కర్రలతో పూలపల్లకి మీద హజరత్ సయ్యద్ కరిముల్లా గంధ మహోత్సవం నిర్వహించారు. గుంటూరు రోడ్డు మీదగా గోనే మస్తాన్‌రావు దర్గా దగ్గర చదివింపులిచ్చి గానుగపాలెం మీదుగా బయలుదేరి బండ్లమిట్ట మీదుగా ప్రకాష్‌కాలనీలోని దర్గాకు చేరుకున్నారు. కార్యక్రమంలో అలీషా, మస్తాన్‌వలి, ఖాదర్ భక్త బృందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చుండూరి పరామర్శ



సుబ్బారావును పరామర్శిస్తున్న చుండూరి రవిబాబు, నాయకులు

ఒంగోలు సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లవరపు సుబ్బారావును ఒంగోలు జీజీహెచ్‌లో చేర్పించగా, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు శనివారం పరామర్శించారు. ఒంగోలు మండల పరిధిలోని యరజర్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సుబ్బారావుకు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆపరేషన్ చేయగా ప్రస్తుతం కోమాలో ఉన్నారు. చుండూరి రవిబాబుతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, గ్రామ పెద్ద అంజయ్య, తదితరులు పరామర్శించారు.

25న సంతనూతలపాడు మండల పరిషత్ సమావేశం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో పలు రంగాల అభ్యున్నతిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, కార్యదర్శులు హాజరుకావాలని సూచించారు.

రోటరీ సేవలు అభినందనీయం

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని క్లబ్ గవర్నర్ రామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం చీమకుర్తిని ఆయన సందర్శించి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గతంలో చేసిన సేవా కార్యక్రమాలను పరిశీలించారు. దివ్యాంగుడికి వీల్‌చైర్ అందించారు.

రొయ్యల రైతులకు ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు ఇప్పించాలి

ఒంగోలు సబర్బన్: రొయ్యల రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం ఎన్‌ఓసీ సర్టిఫికెట్లను త్వరితగతిన ఇప్పించాలని జిల్లా రొయ్యల రైతుల సంఘ నేతలు శనివారం కలెక్టర్ రాజాబాబును కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీచంద్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి మాట్లాడారు. విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 6 మండలాల పరిధిలో 18 వేల ఎకరాలలో రైతులు చెరువులు తవ్వి రొయ్యలు సాగుచేస్తున్నారని తెలిపారు. రొయ్యల రైతులకు కోస్టల్ ఆక్వా అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ కోస్టల్ ఆక్వా డెవలప్మెంట్ అథారిటీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారని, ఈ సర్టిఫికెట్ ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల రైతులకు ఇచ్చే సబ్సిడీ విద్యుత్ అందుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో సాగుచేసుకునే రైతులకు కూడా సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు.

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించండి

చీమకుర్తి: ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను వెంటనే నియమించాలని సంతనూతలపాడు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రార్ ఆఫీసర్ కే మాధురి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో పాటు పలు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల చేర్పులు, సవరణలు వంటి అంశాలను బూత్‌లెవల్ ఏజెంట్లతో కలిసి పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నాం

చీమకుర్తి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై కాలి బూటుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు ఆ సంఘ నాయకులు శనివారం చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్యకు వినతిపత్రం అందించారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు తొరటి ఆనంద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాటతప్పిన తెలంగాణ కాంగ్రెస్

చీమకుర్తి: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణలో బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఆ మాట తప్పిందని బీసీ సంఘాల నాయకులు విమర్శించారు. శనివారం చీమకుర్తిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీంకోర్టు కూడా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పినా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పట్టించుకోనందుకు నిరసనగా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. బీసీ సంఘ నాయకులు బత్తుల మల్లికార్జున, కొత్రపు రాఘవ, మర్రి లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

నేర్చుకున్న విద్య అందరికీ పంచాలి

నాగులుప్పలపాడు: నేర్చుకున్న విద్యను అందరికీ పంచలన్న సంకల్పంతోనే ఈ పప్పేట్ల రూపకల్పన జరిగిందని నాగులుప్పలపాడు మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు మంజుల అన్నారు. గత సెప్టెంబర్ నెలలో సీసీఆర్టీ ఢిల్లీలో పప్పెట్రీ ట్రైనింగ్ పొంది డైరెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ఆమె సర్టిఫికెట్ పొందారు. ఈ విద్యను ఉపాధ్యాయులు అందరూ తమ విద్యార్థులకు అందించాలని సూచించారు. శనివారం మండలంలో జరిగిన కాంప్లెక్స్ మీటింగ్లో ఎంఈఓ అనుమతితో మిగతా ఉపాధ్యాయులకు పప్పేట్ల తయారీపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు చెకుముకి సైన్స్ టెస్ట్

చీమకుర్తి: జేవీవీ ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తి మండలంలో పాఠశాలల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సంబంధిత ప్రశ్నపత్రాలను చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించినట్లు జేవీవీ మండల అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చలువాది రమేష్, ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం కుమార్, బీ ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

రోగులకు సేవా కార్యక్రమాలు

ఒంగోలు సిటీ: స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు శనివారం వీల్ చైర్లు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వర్షిత హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టరు కిరణ్ కుమార్, డెర్మటాలజీ డాక్టరు ఏడుకొండలరావు, డాక్టరు మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

ఆయాలకు దుస్తుల పంపిణీ

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశుధ్య పనులు చేస్తున్న మహిళలకు ఆ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు సొంత నగదుతో శనివారం చీరలు, జాకెట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.శ్రీనివాసరావు, పాఠశాల సెక్రటరీ హరిబాబు, పీడీ సాయికిషోర్, రాజకుమార్, దేవసహాయం, పీఎస్ హెచ్ఎం మస్తాన్, ఉపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.